www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 13 మార్చి 2025
5
తిరుపతి

నేడు హెచ్ఆర్ కమిటీలో చర్చించాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను హెచ్ఆర్ కమిటీలో పరిష్కరించని ఎడల ఆందోళన చేస్తామని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సిఐటియు ప్రధాన కార్యదర్శి టి.కుమార్ తెలిపారు. ఈనెల 13న విజయవాడలో జరిగే హెచ్ఆర్ కమిటీ సమావేశంలో చర్చించాలని కోరారు. అనేకమార్లు ఆందోళన చేయగా హెచ్ఆర్ కమిటీపరిధిలో అని చెప్పి దాటవేస్తున్నారని, సమస్యను పరిష్కరించడంలో అధికారులు నిమ్మకునీరెత్తినట్లు ఉన్నారని మండిపడ్డారు. ఈ కారణంగా లక్షల రూపాయల అరియర్స్ కోల్పోతున్నామన్నారు. ఈ మేరకు సిజిఎం హెచ్ఆర్‌డిని కలిసి వినతిపత్రంలో సమర్పించారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు రవి, మురళి, వినోద్, భార్గవి, ధర్మ, సోము, సుధ పాల్గొన్నారు.

సాధికారితకై మహిళలు ఉద్యమించాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

మహిళలు తమ హక్కులు, సమానత్వం, సాధికారిత, సామాజిక మార్పుకు అవగాహనతో పాటు ఉద్యమించాల్సిన కర్తవ్యం ఉందని స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్‌వి కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్విమ్స్‌లోని శ్రీ పద్మావతి ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ముగింపు వేడుకలు జరిగాయి. విశిష్ట అతిథిగా పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ, గౌరవ అతిథిగా డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు ఎం.శ్రీలత, స్విమ్స్ రిజిస్ట్రార్ అపర్ణ, ఉషాకళావత్, డాక్టర్ వనజాక్షమ్మ, డాక్టర్ మధుబాబు, డాక్టర్ సుధారాణి, డాక్టర్ మాధవి పాల్గొని జ్యోతి ప్రజ్వలనం చేశారు. వీసీ ఉమ మాట్లాడుతూ మహిళల ఆర్థిక, సామాజిక స్థితిగతుల మారుపకు విద్య ఏజెంట్‌లా ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో పాల్గొన్న విజేతలు ఎనిమిది మందికి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

శ్రీకాళహస్తి : టీడీపీ ఆవిర్భావం నుండి మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ వస్తోందని తెలుగు మహిళలు అన్నారు. స్థానిక ఎన్టీఆర్ భవన్ లో తెలుగు మహిళలు బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఇంటిని సమర్థవంతంగా నడిపే మహిళ రాజకీయాల్లోనూ మరింత రాణించి సత్తా చాటగలదని గుర్తించిన మాజీ సీఎం ఎన్టీఆర్ పురుషులతో సమానంగా మహిళలకు ఆస్తి హక్కు కల్పించారని గుర్తు చేశారు. దానికి కొనసాగింపుగా చంద్రబాబు మహిళల ఆర్థిక స్వావలంబనకు డ్వాక్రా పథకానికి శ్రీకారం చుట్టి వారి జీవన స్థితిగతులను మార్చారన్నారు. మహిళల పేరుమీద ఇళ్లపట్టాలు, ఇంటి నిర్మాణం, భూమి కొనుగోలు వంటి పథకాలు ఎన్నో ఆచరణాత్మకంగా అమలు చేసి చూపించారు. దీనికి కొనసాగింపుగా కూటమి ప్రభుత్వం మహిళా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ 2025 –26 బడ్జెట్ లో మహిళా శిశు సంక్షేమానికి రూ.4332 కోట్లు కేటాయించారని తెలిపారు. 2025 –26 రాష్ట్ర బడ్జెట్ ప్రత్యేకించి మహిళల బడ్జెట్ అన్నారు. మహిళల సంక్షేమానికి, ఆర్థిక పరిపుష్టికి తోడ్పడి రాష్ట్రంలోని మహిళల సాధికారతకు బాటలు వేస్తుందని చెప్పారు. వైసీపీ హయాంలో రాష్ట్రంలో మహిళలు ఉన్నారన్న సంగతే మరిచి బడ్జెట్ లో వారికీ అన్యాయం చేశారని చెప్పారు. తెలుగు మహిళలు సుమతి, మల్లీశ్వరి, రేణుకా దేవి, అనిత, కుమారి, చంద్రమ్మ, అమరావతి, తులసి, ద్రాక్షయని, గజలక్ష్మి, సుమతి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

పెరుగుతున్న జనాభా దష్ట్యా తిరుపతిలో ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని బుధవారం అసెంబ్లీ లో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. టిటిడి ఆధ్వర్యంలో ఉన్న కాలేజీలు మినహా ప్రభుత్వానికి సంబంధించి కాలేజీలు లేవని ఆయన ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్ళారు. కాగా శెట్టిపల్లి భూమలకు సంబంధించి ముప్పయ్ ఏళ్ళుగా సమస్య పరిష్కారం కాలేదని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆ గ్రామాన్ని సందర్శించి పరిష్కరిస్తామని చెప్పారని ఆయన గుర్తు చేశారు. ఐతే గత ఐదేళ్ల దుర్మార్గపు పాలనలో శెట్టిపల్లి వాసుల సమస్యను పరిష్కరించకపోగా మున్సిపాలిటీలో కలిపేశారని ఆయన చెప్పారు. మున్సిపాలిటీ ఎటువంటి అభివద్ధి పనులు చేపట్ట లేదని ఆయన చెప్పారు. 2019లో శెట్టిపల్లిని తుడా పరిధిలో కలిపారని తిరిగి మున్సిపాలిటీ నుంచి తప్పించి తుడా పరిధిలో వెంటనే చేర్చేలా మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. అలాగే 30ఏళ్ళ కిందట వేసిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం వేశారని ఆయన తెలిపారు. డ్రెయినేజీ వ్యవస్థ పాతది కావడంతో నిత్యం డ్రైనేజీ ఇబ్బందులను ప్రజలు ఎదుర్కొంటున్నారని, కావున కొత్తగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

దేవుడా..నీ పక్కనే 'మద్యం'

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

పట్టణంలోని 24, 18 వార్డుల మధ్య గల చిత్తూరు – పుత్తూరు జాతీయ రహదారిలో శ్రీ ఆంజనేయస్వామి దేవాలయాన్ని ఆనుకునే మద్యం దుకాణాన్ని తెరిచే ప్రయత్నాలు చేస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్వేటినగరం రోడ్డులోని ప్రజలు బుధవారం తహశీల్దార్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ మంజునాథగౌడ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్ మాట్లాడుతూ ఓ పక్క దేవాలయం, లైబ్రరీ, మరోపక్క ఆస్పత్రి, పాఠశాలలు, సినిమా హాల్స్ ఉన్నాయన్నారు. వందమీటర్ల దూరంలోనే శ్రీ ద్రౌపదమ్మ తిరుణాళ్ల జరిగే మంచినీళ్లగుంట మున్సిపాలిటీ పార్కు ఉంది. నిత్యావసర సరులు కొనేందుకు నిత్యం ఈ ప్రాంతం రద్దీగా ఉంటుంది.

దుకాణం తెరవద్దని వినతి

ఈ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తారని తెలియడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో ఈ ప్రాంతంలో స్కూటర్, లారీ, బస్సులు ఢీకొని ప్రమాదాలకు అడ్డాగాను నిలిచింది. ప్రధానంగా మద్యం ప్రియులు తూలుతూ తిరగడం ప్రమాదాలకు కారణమవుతుందని స్థానికులు మండిపడుతున్నారు. వాహనాలు సైతం రోడ్డుపైనే నిలిపేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగే ప్రమాదం లేకపోలేదు. ఈ మార్గంలో మహిళలు, స్కూలు విద్యార్థులు, వాహనదారులు నిత్యం తిరుగుతుంటారు. మద్యంప్రియులు తాగిన మైకంలో అసభ్య పదజాలంతో దాడులకు పాల్పడే అవకాశం ఉంది. ఎక్సైజ్ అధికారులు స్పందించి మద్యం దుకాణం ఏర్పాటును ఆపాలని స్థానికులు కోరుతున్నారు.

ఏర్పాటు చేస్తే అడ్డుకుంటాం : వెంకటేష్, సిపిఎం

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గుడి, బడి, గ్రంథాలయాలకు వంద కిలోమీటర్ల దూరంలో మద్యం షాపు ఉండరాదు. అయితే పుత్తూరు పట్టణంలో కార్వేటినగరం రోడ్డులో ఆంజనేయస్వామి ఆలయానికి ఆనుకునే మద్యం షాపు ఏర్పాటు చేయాలని చూస్తున్నారని తెలుస్తోంది. ఇదేగనుక జరిగితే స్థానికులతో కలిసి మద్యం షాపును అడ్డుకుంటాం. ఎక్సైజ్ అధికారులు అనుమతి ఎలా ఇచ్చారో అర్థం కావడం లేదు.

గృహ నిర్మాణాలకు ఊతం : కలెక్టర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి జిల్లా పరిధిలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన–1 పథకం ద్వారా ఎవరైతే ఏప్రిల్ మాసం చివరిలోగా ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేసుకుంటారో వారికి సాధారణంగా ఇచ్చే లబ్ధి కాకుండా అదనపు ఆర్థిక లబ్ధి చేకూరనుందని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా, జిల్లాలో 2029 నాటికి అందరికీ గహనిర్మాణం అనే లక్ష్యాన్ని సాధించేందుకు, అసంపూర్తిగా ఉన్న గహ నిర్మాణాలను పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయం అందిస్తోందని ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందు కోసం రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెంబర్ 9 విడుదల చేసిందన్నారు. పిఎంఎవై ద్వారా ఇప్పటికే మంజూరు చేయబడిన ఇళ్ళకు రూ.1.80 లక్షల రూపాయలకు అదనంగా నిర్మాణ దశలోనే ఉన్న లబ్దిదారునికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేల రూపాయలను లబ్ధిదారులకు అదనంగా అందించబడుతుందన్నారు. ఈ ఆర్థిక సహాయం 2024, డిసెంబర్ 10 నాటికి నిర్మాణ దశలో ఉన్న ఇళ్లకు మాత్రమే వర్తిస్తుందని, నిర్మాణాలు పూర్తి చేసిన తర్వాత బిల్లులను వెంటనే సమర్పించాలన్నారు. మే నెలాఖరు నాటికి 17,455 గహాలు పూర్తి చేయాలని, ఎంపీడీఓలు, హౌసింగ్ ఏఈలు ఈ ప్రక్రియను పర్యవేక్షించాలని ఆదేశించారు. దీనిపై జిల్లా యంత్రాంగం ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు.

'దిల్ రూబ' సినిమాను విజయవంతం చేయండి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

మార్చి 14న దిల్ రూబ సినిమా విడుదల అవుతోందని, దీనిని ప్రేక్షకులు విజయవంతం చేయాలని ప్రముఖ సినీ నటుడు కిరణ్ అబ్బవరం కోరారు. స్థానిక ఓ ప్రైవేటు హోటల్ లో బుధవారం అయిన విలేకరులతో మాట్లాడుతూ హోలి రోజు సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోందన్నారు. ఇది తన పదవ సినిమా, అందరికీ నచ్చుతుందన్నారు. సినిమాలో ట్విస్ట్ లు ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది.తన క్యారెక్టర్ కొత్తగా కనిపిస్తుందని, ప్రేక్షకులను అలరిస్తుందన్నారు.. కొత్తవారికి సినిమాల్లో అవకాశం రావడం లేదు, రాయలసీమ నుంచి వచ్చే వారికి సినిమాల్లో అవకాశాలు చాలా తక్కువని, రాయలసీమ నుంచి హీరోలు ఎవరైనా ఉన్నారంటే అది ఒక్క మోహన్ బాబు కుటుంబమే అన్నారు. కిందిస్థాయి నుంచి వచ్చిన తాను సమాజ సేవ చేయాలనుకుంటున్నా అన్నారు. హీరోయిన్లు రుక్సా దిల్లాన్, నజియా, చిత్రబృందం పాల్గొన్నారు.

తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నిక అల్లర్ల కేసు వాయిదా

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

డిప్యూటీ మేయర్ ఎన్నిక సందర్భంగా జరిగిన అల్లర్లపై స్టేటస్ రిపోర్ట్‌ను సమర్పించాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నిక సందర్భంగా కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన అల్లర్లపై సిబిఐ దర్యాప్తు కోరుతూ ప్రముఖ ఆర్థికవేత్త సుబ్రమణ్యా స్వామి దాఖలు చేసిన పిటిషన్ పై హైకోర్టులో విచారణ అల్లర్లపై పోలీసులు నమోదు చేసిన కేసులు, వాటిపై దర్యాప్తు ఏం చేశారు, దర్యాప్తు ఎంతవరకు వచ్చింది తదితర వివరాలతో స్టేటస్ రిపోర్ట్ సమర్పించాలని స్పష్టం చేసిన హైకోర్టుస్టేటస్ రిపోర్ట్ ను పరిశీలించిన తర్వాత ఏం చేయాలో నిర్ణయిస్తామని తెలిపింది. తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది.

నిరుపయోగ డిష్ వైర్లు తొలగింపు

తిరుపతి సిటి : నిరుపయోగంగా కిందకు వేలాడుతూ ఆటంకంగా ఉన్న డిష్ వైర్లను ఎస్ఇ సురేంద్రనాయుడు, ఇఇ చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు బాలాజీ కాలనీ సర్కిల్‌నుంచి కృష్ణాపురం ఠాణా వరకూ ప్రతి పోలును పరిశీలించి వైర్లను తొలగించారు. అత్యవసర సమయంలో పోలు ఎక్కాలంటే సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఆపరేషన్ డిఈఈ–1 ఆంజనేయులు, ఏఈలు మునిరామ్, ఉమాపతీ, బాలగున్నయ్య, రామాంజనేయులు పాల్గొన్నారు.

హుండీలో నగదు చోరీ

ప్రజాశక్తి -రామచంద్రాపురం

మండలంలోని బ్రాహ్మణకాల్వ గ్రామంలో శ్రీ అంకమ్మ పుల్లమ్మ దేవాలయంలో ఉన్న హుండీలో నగదు చోరీకి గురి అయింది. మంగళవారం గ్రామస్తులందరూ శ్రీ అంకమ్మ పుల్లమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవార్లకు పంచలోహాలతో కూడిన మరక తోరణాలను బహుకరించి హుండీలో అమ్మవారికి నగదు సమర్పించారు. మంగళవారం సాయంత్రం హుండీని గర్భగుడిలో భద్రపరిచి తాళాలు వేశారు. అర్ధరాత్రి దొంగలు గుడి తాళాలను పగలగొట్టి లోపల ఉన్న హుండీని పగలగొట్టి నగలు దొంగలించి తీసుకెళ్లారు. ఉదయం అమ్మవారికి ధూప దీప నైవేద్యాలు సమర్పించేందుకు వెళ్లగా హుండీ తాళాలు పగలగొట్టి నగదు తీసుకెళ్లినట్లు గ్రహించి గ్రామస్తులు పరిశీలించారు. గ్రామస్తులు వెంటనే ఆర్ సి పురం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. హుండీలో సుమారు రూ. 1.50 వేలు నగదు ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు..

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

ప్రజాస్వామ్య పరిరక్షణలో పోరాటం నిత్యకృత్యం : సిపిఐ

తిరుపతి సిటీ : ప్రజాస్వామ్య పరిరక్షణలో పోరాటం నిత్యకృత్యమని, పోరును ఎంచుకున్న వారికి ఆలస్యమైనా విజయం తథ్యమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ వ్యాఖ్యానించారు. బైరాగిపట్టెడ కూడలి సమీపంలోని సాయినగర్ పంచాయతీ పరిధిలో ఏర్పాటైన 'ఫ్రెండ్లీ వైన్ షాప్ తొలగింపునకు అధికారులు చర్యలు చేపట్టారు. ఆ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు కావడంతో స్థానికులు, మహిళలు, పాఠశాల విద్యార్థులకు ఇబ్బంది దృష్ట్యా గడిచిన పది రోజులుగా సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను చేపట్టారు. పలు దఫాలుగా అధికారులకు వినతి పత్రాలను అందజేశారు. ఈ విషయంగా మంగళవారం తిరుపతిలోని గంధమనేని శివయ్య భవనంలో సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విలేకరుల సమావేశం నిర్వహించి సాయినగర్ ప్రాంతంలో ప్రజలకు ఇబ్బంది కరంగా ఉన్న వైన్ షాప్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. తక్షణమే అక్కడి నుంచి తొలగించకుంటే తగిన రీతిలో పోరాటం చేస్తామని మీడియా ఎదుట ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్పందించిన జిల్లా అధికారులు మంగళవారం సాయంత్రానికి ఫ్రెండ్లీ వైన్ షాప్ ను అక్కడి నుంచి మరో చోటుకు తరలించాలంటూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం ప్రత్యేకంగా అభినందన సభ ఏర్పాటు చేసి సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అభినందించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ మహిళలు విరామం ఎరుగక చేసిన పోరాట ఫలితంగా విజయం సాధించారని కొనియాడారు. ఈ అభినందన సభలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ రామానాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి పి మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన ఏపీఐఐసీ ఛైర్మన్



ప్రజాశక్తి - సత్యవేడు

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌళిక సదుపాయాల కల్పనా సంస్థ (ఏపీఐఐసీ) ఛైర్మన్ ఎం.రామరాజు శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ డైరెక్టర్ ముకుంద రెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి, పారిశ్రామికవాడ ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. రామరాజు ఎంతో ఆసక్తితో శ్రీసిటీలోని వివిధ అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. సమావేశం అనంతరం శ్రీసిటీ పరిసరాలలో పర్యటించి పారిశ్రామిక కార్యకలాపాలను వీక్షించారు. పెప్సికో పరిశ్రమను సందర్శించి ఉత్పత్తులను పరిశీలించారు. రామరాజు పర్యటనను తాము గౌరవప్రదంగా భావిస్తున్నామని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వ్యాఖ్యానించారు. ఏపీఐఐసీ ఛైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఇది మొట్టమొదటి శ్రీసిటీ సందర్శన కాగా, ఆయన పరిశీలనలు, సూచనలు తమకెంతో విలువైనదంటూ తన సందేశంలో పేర్కొన్నారు. ఏపీఐఐసీ ఛైర్మన్‌తో పాటు జోనల్ మేనేజర్ విజయ భరత్ రెడ్డి ఈ పర్యటనలో పాల్గొన్నారు.

17న 'చలో విజయవాడ'

తిరుపతి టౌన్ : గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం, గుర్తింపుకార్డు, ఇఎస్ఐ, పిఎఫ్, ప్రమాదబీమా, టెండర్ విషయంలో హైకోర్టు తీర్పులను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 17న చలో విజయవాడ కార్యక్రమం చేపట్టి మహాధర్నా చేయనున్నట్లు సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర , యూనియన్ జిల్లా కార్యదర్శి రాము పేర్కొన్నారు. ఈ మేరకు సిఐటియు కార్యాలయంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా పాలకులు, జెండాలు మారుతున్నాయి తప్ప, కార్మికుల జీవితాల్లో ఎలాంటి మార్పు లేదన్నారు. పంచాయతీ కార్మికులు పోరాడి సాధించుకున్న జీవులు దశాబ్దాలుగా అమలు కావడం లేదన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులకు 12వేల లోపు ఇస్తున్నారని, మున్సిపల్ కార్మికులకు 24వేలపైన జీతాలు చెల్లిస్తున్నారన్నారు. విజయవాడలో జరగనున్న ధర్నాలో పెద్దఎత్తున గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నాగభూషణం, నాయకులు కిరణ్, భాస్కర్, సూరి, వెంగమ్మ పాల్గొన్నారు.

'మేళా'ను సద్వినియోగం చేసుకోండి : కమిషనర్

తిరుపతి టౌన్ :

తిరుపతి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 13 నుండి 20 వరకు నిర్వహించనున్న బి.పి.ఎస్., ఎల్.ఆర్.ఎస్. మేళాను సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ (బి.పి.ఎస్.) –2019, లే అవుట్ రేగులరైజేషన్ స్కీమ్ (ఎల్.ఆర్.ఎస్.)–2020 లో పెండింగ్ లో వున్న దరఖాస్తులను క్రమబద్దీకరణ చేసుకోవడానికి, టి.డి.ఆర్. లపై అవగాహన కల్పించనున్నామని తెలిపారు. మార్చి 13 వ తేదీ నుండి 20 వ తేదీ వరకు ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక మేళా నిర్వహిస్తున్నామని అన్నారు. సెలవు రోజుల్లో ఉండదని, ఎల్.టి.పిలు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ఆ ప్రకటనలో తెలిపారు.

అధికారులపై రాజకీయ కక్షసాధింపు వద్దు : ఎంపి

తిరుపతి టౌన్ : ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు గ్రూప్ వన్ అధికారులపై జరుగుతున్న కక్షసాధింపు చర్యలపై వైసిపిఎ తిరుపతి ఎంపి బుధవారం లోక్‌సభ జీరో అవర్‌లో ప్రస్తావించారు. జూన్, 2024 నుండి అనేక మంది అధికారులకు ఎలాంటి పోస్టింగ్ ఇవ్వకుండా వారిని వేధిస్తున్నారని కేంద్ర ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంలో పూర్తి స్పష్టత కోసం కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.

'అధికార' కనుసన్నల్లో 'బిసి కార్పొరేషన్'

రుణాలు.. కొందరికేనా..!

ప్రజాశక్తి - ఓజిలి

ఆర్థికంగా వెనుకబడిన పేద బడుగు బలహీన వర్గాలకు స్వయం ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో ప్రవేశపెట్టిన బీసి కార్పొరేషన్ రుణాలు అందరికీ వచ్చే అవకాశం లేదని చర్చ నడుస్తోంది. దరఖాస్తు చేసుకున్న వారిలో సగం మందికి కూడా ఇచ్చే అవకాశం లేదు. దీంతో ఎవరికి ఇవ్వాలనేది అధికార పార్టీ శాసనసభ్యుల కనుసన్నల్లోనే 'జాబితా' రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది. మధ్యవర్తులు కొంతమంది తాము తప్పకుండా ఇప్పించే ప్రయత్నం చేస్తామని లబ్దిదారులతో బేరసారాలు ఆడుతూ వారిని మభ్యపెడుతున్నట్లు సమాచారం. రాయితీతో అందజేస్తున్న బిసి రుణాలకు భారీగా ఆదరణ ఉండటం గమనార్హం.

బిసి కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం ఓజిలి మండలంలో 272 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ పర్తయ్యింది. మండల స్థాయి, బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలను సైతం నిర్వహించారు. మండలంలో 40 శాతం బీసీలు ఉండగా, ఇందులో కేవలం 52 యూనిట్లు మాత్రమే బీసీలకు మంజూరయ్యాయి. ప్రభుత్వ రాయితీ 55 లక్షలు కాగా, బ్యాంకుల ద్వారా 55 లక్షల రుణాలను ఇస్తున్నారు. ప్రభుత్వం నుంచి భారీగా సబ్సిడీ ఇస్తుండడంతో 272 మంది దరఖాస్తు చేసుకున్నారు. 162 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఎలాగైనా కార్పొరేషన్ రుణం దక్కించుకుని తాము జీవితంలో స్థిరపడాలన్న ఆశతో లబ్దిదారులు ఉన్నారు. అయితే పెద్దమొత్తంలో దరఖాస్తు చేసుకోవడం, యూనిట్లు తక్కువగా ఉండడంతో రోజురోజుకూ ఆశలు సన్నగిల్లుతున్నాయి. నియోజకవర్గ శాసనసభ్యుల వద్దనే రుణాల జాబితా ఉన్నట్లు తెలియడంతో కొంతమంది మధ్యవర్తుల ద్వారా పడరాని పాట్లు పడుతున్నారు. గ్రామాల్లో ఒకరికి ఇస్తే మరొకరు వ్యతిరేకం అవుతారన్న చర్చ నడుస్తుంది. బీసీల శాతం ఎక్కువగా ఉన్నా, యూనిట్లు తక్కువగా ఉండటంపై లబ్దిదారులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

నమ్మించి మోసం చేశారు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

సొంతింటి కల నిజం చేసుకోవాలనుకుంటే భూవిక్రయదారులు నమ్మించి మోసం చేశారని, న్యాయం కోసం పోలీస్ స్టేషన్ కెళితే అక్కడా కుట్రదారులకే మద్దతు పలుకుతున్నారని బాధితులు చిన్న సుబ్బయ్య, మహబూబ్ బాషా కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు జరిగిన అన్యాయాన్ని మీడియాకు వివరించారు. తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం గ్రామ పంచాయతీ లెక్కదాఖలా సర్వే నెంబర్ 245/3బిలో చిన్న సుబ్బయ్య 27 1/2, మహబూబ్‌భాషా 37 1/2 అంకణాల స్థలాన్ని కాలూరు క్రాస్‌లో కాపురముంటున్న విమలమ్మ దగ్గర నుండి 2021లో కోనుగోలు చేశామన్నారు. ఈ స్థలానికి సంబంధించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ కాకముందే రెండు ప్లాట్లు జాతీయ రహదారి నిర్మాణానికి పోయాయన్నారు. స్థలం నష్ట పరిహారాన్ని కూడా తమకు స్థలం విక్రయించిన విమలమ్మ పొందారన్నారు. జరిగిన మోసాన్ని పోలీసులకు చెప్పి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటారని గడిచిన మూడేళ్లుగా తిరుగుతున్నా పోలీసులు విమలమ్మ, ఆమె కుమారుడు నరేందర రెడ్డి, మధ్య వర్తులుగా వ్యవహరించిన ప్రసాద్, రఘునాథ, రాజేంద్ర, బాలకృష్ణ, మిగిలిన నలుగురికి మద్దత్తుగా మాటాడుతున్నారని కన్నీరు పెట్టారు. నమ్మించి లక్షల రూపాయలు కాజేశారని, వీరిపై జిల్లా ఎస్పీ స్పందించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

తిరుపతిలో 'సుందరం టిఫిన్ హౌస్'

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

సాంప్రదాయకమైన రుచికరమైన వంటలకు ప్రామాణికంగా నిలచిన సుందరం టిఫిన్స్ ఇప్పుడు ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతి లో ప్రారంభించారు. దక్షిణ భారతదేశ రాష్ట్రాలకు చెందిన రుచికరమైన ఆహారపు వంటలను అందించాలన్నదే సుందరం టిఫిన్ హౌస్ లక్ష్యం. ఈ నేపథ్యంలో బుధవారం రామానుజ సర్కిల్ లో తిరుచానూరు రోడ్డులోని హెచ్.పీ పెట్రోల్ బంకు పక్కన ఆర్చిడియా గ్రూప్ ఆఫ్ హోటల్స్ లో లాంఛనంగా ప్రారంభించారు. మొదట హార్కిడ్ హోటల్స్ గ్రూప్ ఆఫ్ మేనేజింగ్పియస్. జయచంద్ర రాజు, పి. అనిత రాజు దంపతుల చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి సుందరం టిఫిన్ హౌస్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ 2004వ సంవత్సరంలో బెంగళూరు బనశంకరి లో క్యాటరింగ్ రంగంలో మొట్టమొదట అడుగుపెట్టి భోజన ప్రియులకు ఇంటిల్లిపాది రుచికరమైన నాణ్యమైన అల్పాహార వంటకాలను అందించి దక్షిణాది రాష్ట్రాల భోజన ప్రియుల మన్ననలను అందుకుంది. దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్ కర్ణాటక తమిళనాడు కేరళ ప్రాంతాల ప్రజలకు అందించాలన్న లక్ష్యంతో సుందరం టిఫిన్ హౌస్ ను తిరుపతి ఆధ్యాత్మిక నగరంలో ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కర్ణాటక తమిళనాడు కేరళ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల యొక్క పాక సాంప్రదాయాలకు అనుగుణంగా న్యాచురల్ గా హెూమ్లీ ఫుడ్ ను ప్రజలకు అందించాలన్నదే తమ లక్ష్యం అని పేర్కొన్నారు. తిరుపతి నగరంలో ఆర్చిడియా గ్రూప్ ఆఫ్ హెూటల్స్ మూడు 3 స్టార్ హెూటల్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. దేశ నలుమూలల నుండి వచ్చే భక్తులకు అందుబాటులో సరసమైన ధరలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా విశాలమైన గదులతో ప్రారంభించడం జరిగిందన్నారు. ఇప్పుడు తిరుపతిలోని తమ గ్రూపుకు చెందిన మూడు స్టార్ హెూటలలో సుందరం టిఫిన్స్ అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఆర్గానిక్, ట్రెడిషనల్, హెల్తీ ఫుడ్ ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. పాండిచ్చేరి, బెంగుళూరులలో సుందరం టిఫిన్ శాఖలు ఎక్కువగా విస్తరించి ఉన్నాయని, ఎక్కువమంది ప్రజలు హెూమ్లీ ఫుడ్ ను అనుభవించగలరని తెలిపారు. ఈనెల 26వ తేదీ తిరుపతిలోని కేటి రోడ్డులో మరొక సుందరం టిఫిన్ హౌస్ అవుట్ లెట్ ను ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈనెల 15 వరకు 50శాతం డిస్కౌంట్, సుందరం టిఫిన్ హౌస్ లో వంటకాలు భోజనం ప్రియులకు ప్రజలకు 50శాతం రాయితీతో ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

విద్యా సామగ్రి వితరణ

విద్యా సామగ్రి అందిస్తున్న ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ఆ పాటశాల హిందీ ఉపాధ్యాయులు ఎన్ శ్రీరాములు విద్యా సామగ్రి బుధవారం పంపిణీ చేశారు. రూరల్ మండలం గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వీడ్కోలు మహాసభ ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు భారతి అధ్యక్షతన బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయుడు విద్యార్థులకు ప్యాడ్, పెన్నులు, స్కేల్స్, పెన్సిల్స్ , జామెంట్రీ బాక్సులు, తదితర విద్యా సామగ్రి అందించారు. పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి ప్రతిభ చూపాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యా యురాలు భారతి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన వీడ్కోలు సమావేశం

ప్రజాశక్తి- ఏర్పేడు : ఏర్పేడు మండలంలోని మునగల పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన నృత్య, గీతాలు అందరిని ఆకట్టుకున్నాయి.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

రాష్ట్ర కబడ్డీ పోటీలకు గూడూరు విద్యార్థి


హర్షవర్ధన్‌తో ప్రధానోపాధ్యాయులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు జిఎస్ఆర్ మున్సిపల్ హై స్కూల్ కు చెందిన 8వ తరగతి విద్యార్థి హర్షవర్ధన్ రాష్ట్రస్థాయి కబడ్డీ అసోసియేషన్ జూనియర్ ఛాంపియ న్ షిప్ లో పాల్గొనడానికి ఎంపిక కావడం గర్వకారణమని పాఠశాల హెడ్మాస్టర్ మధుసూదన్ రావు తెలి పారు. ఈనెల 7వ తేదీన కావలిలో ఉమ్మడి నెల్లూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సబ్ జూనియర్ ఎంపిక పోటీలలో హర్షవర్ధన్ తన ప్రతిభను నిరూపించి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యాడు. ఈ పోటీలు ఈనెల 14, 15, 16 తేదీలలో కడప జిల్లాలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా, విద్యార్థి ఎంపిక కోసం కృషి చేసిన మ్యాజిక్ బస్ ఫౌండేషన్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయు డు ఎస్. వెంకటసుబ్బయ్య , మ్యాజిక్ బస్ ఫౌండేషన్ కోచ్ లతాను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని రాష్ట్ర క్రీడాకారులుగా తమ పాఠశాల విద్యార్థులు రాణించాలని ఆశిస్తున్నట్లు హెడ్మాస్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

భవిష్యత్ రోబో యుగానిదే..

గీతాంజలి పాఠశాలలో రోబోల ప్రదర్శన

మాట్లాడుతున్న ప్రముఖులు

ప్రజాశక్తి -రామచంద్రాపురం: భవిష్యత్తులో అన్ని రంగాలలో వచ్చేది రోబోల యుగమే అని రామచంద్రపురం మండల ఎంఈఓ వి మార్కండేయనాయుడు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఉన్న గీతాంజలి ప్రైవేట్ స్కూల్లో రోబోల ప్రదర్శనలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల ఎంఈఓ మార్కండేయ నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన రోబో ఎగ్జిబిషన్ ఆయన తిలకించి పిల్లలను రోబో ఎలా పనిచేస్తుందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంఈఓ వి మార్కండేయ నాయుడు మాట్లాడుతూ మాట్లాడుతూ రాబోయే కాలం లో రోబోలే కీలక మన్నారు. ప్రతి కార్యాలయంలో మనుషులకు బదులు రోబోలే పనిచేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ నెల్లూరి మాధవి, పాఠశాల అధినేత ఎన్ గోపిచౌదరి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రదర్శించిన రోబో

వేద వర్సిటీలో అంతర్జాతీయ కార్యశాల ప్రారంభం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర వేదవిశ్వ విద్యాలయంలో వైఖానస, పాంచరాత్ర, శైవాగమంలలో నిర్వహించనున్న 21 రోజుల కార్యశాల ప్రారంభ సమావేశం బుధవారం వర్సిటీ విసి ఆచార్య రాణి సదాశివమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవారి ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, ముఖ్య వక్తలుగా డాక్టర్ వేదాంతం సత్య శ్రీనివాస అయ్యంగార్ అంతర్జాల మాధ్యమం ద్వారా పాల్గొన్నారు . కార్యక్రమంలో సత్య శ్రీనివాసు అయ్యంగార్, విసి ఆచార్య సదాశివమూర్తి, కుల సచివులు, పి,భాస్కరుడు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్ల పరిశీలన


రోడ్లను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి -ఏర్పేడు : మండలంలోని పంగూరు పంచాయతీలో నిర్మించిన సిమెంట్ రోడ్డు నిర్మాణం పనిని డ్వామా సంచాలకులు సివి శ్రీనివాస్ ప్రసాద్ క్వాలిటీ కంట్రోల్ సభ్యులతో కలిసి బుధవారం తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమం లో క్వాలిటీ కంట్రోల్ అసిస్టెంట్ ఇంజనీర్ లక్ష్మి నరసింహ, రాఘవేంద్ర రావు, సురేష్ నాయుడు,అధనపు కార్యమాధికారులు డి.చంద్ర శేఖర్ రాజు, అవిలాల దేవరి,మండల ఇంజనీర్ రవి తేజ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లక్ష్మి , టెక్నికల్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

నిత్య జీవితంలో గణిత ఆవర్తనాల ఆవశ్యకత : వీసి

మాట్లాడుతున్న విసి అప్పారావు

ప్రజాశక్తి - క్యాంపస్ : నిత్యజీవితంలో గణిత ఆవర్తనాల ఆవశ్యకత ఎంతో ఉందని ఎస్వీయూ విసి ఆచార్య సిహెచ్ అప్పారావు పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయంలోని గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో "ఆల్జీబ్రా ఆల్జీబ్రిక్ నెంబర్ థియరీ టోపాలజీ అండ్ దేర్ అప్లికేషన్స్ 2025" అనే అంశంపై మూడు రోజుల కార్యశాల బుధవారం గణిత విభాగం సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యశాల కోఆర్డినేటర్ ఆచార్య సి. జయసుబ్బారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ ఎస్వియు విద్యార్థులకు ఇబ్బంది..

- ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి

ప్రజాశక్తి - క్యాంపస్ : వైసిపి ప్రభుత్వ హయాంలో యూనివర్సిటీ ప్రతిష్టని , ప్రశాంతతని దెబ్బతీసే విధంగా మూడు మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణానికి చేసిన చేసిన ప్రతిపాదనలపై మండలిలో తూర్పు రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి అంశాన్ని ప్రస్తావించారు. విద్యార్థులకు ఇబ్బందికర, యూనివర్సిటీ ప్రశాంతతను దెబ్బతీసే మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం గత వైసిపి ప్రభుత్వం చేసిన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఇందుకు మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ స్పందిస్తూ యూనివర్సిటీని ప్రతిష్టను దెబ్బతీసే నిర్ణయాలు ఏమి ఈ ప్రభుత్వం తీసుకోదని యూనివర్సిటీ మీదుగా వెళ్లే మాస్టర్ ప్లాన్ రోడ్లని వెంటనే ఉపసంహరించుకొని ప్రత్యామ్నాయ మార్గాలని ప్రభుత్వం అన్వేషిస్తుందని సమాధానం చెప్పారు.

మహిళా వర్సిటీలో విరంచి ప్రారంభం

మహిళలను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహి ళా విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సాంస్కృతిక విరంచి 25ను బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా ఆచార్య వి ఉమ హాజర య్యారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికి తీసి చర్యల్లో భాగంగా విరంచి కార్యక్రమాన్ని ప్రతి ఏటా ఇంజనీరిం గ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహి స్తున్నా రన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ శ్రీనివాసరావు, విద్యార్థిను లు పాల్గొన్నారు.

సేఫ్టీ పరికరాలు కరువు

ఆందోళనలో పారిశుద్ధ్య కార్మికులు

సేఫ్టీ పరికరాలు లేకుండానే ట్రాక్టరుపై చెత్తను సరిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు

ప్రజాశక్తి-వెంకటగిరి టౌన్: మున్సిపల్ పారిశుధ్య విభాగంలో సేఫ్టీ పరికరాలు కరువయ్యాయి. ఇందుకు వెంకటగిరి టౌన్ తూర్పు వీధి ఏరియాలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు బుధవారంచెత్త ట్రాక్టర్ దగ్గరకు వచ్చి కార్మికుడిని పైకి ఎక్కించి కాళ్లతో చెత్త తొక్కించే పని చేశారు. సేఫ్టీ పరికరాలు లేవు కదా ఇంజక్షన్స్, గాజు సీసాలు గుచ్చుకుంటే తమ ఆరోగ్య పరిస్థితి ఏంటి? అని కార్మికులు ప్రశ్నించగా 'అవి అన్నీ నాకు తెలీయదు.. లేదంటే పనిలోకి రావద్దు..!' అని మాట్లాడుతున్నారు. 'చెత్తాచెదారం మురుగు లోకి ఎక్కి తొక్కించే పని చేస్తే తమ ఆరోగ్యాలు ఎవరు కాపాడుతారు?' అని కార్మికులు అడుగుతున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఈ విధమైన చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి రామారావుపై చర్యలు తీసుకొని కార్మికులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

హాస్టల్ గదుల నిర్మాణానికి శంకుస్థాపన

హాస్టల్ అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- సత్యవేడు: సత్యవేడు బీసీ కాలనీలో ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహ ప్రాంగణంలో మూడు అదనపు గదుల నిర్మాణానికి ఎస్ఎస్ ఇన్స్ట్రుమెంట్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ హాజీ కచోకాసేన్ బుధవారం శంకుస్థాపన చేశారు. జిల్లా బీసీ సాంఘిక సంక్షేమ అధికారిణి జోత్స్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ ఇన్స్ట్రుమెంట్ కంపెనీ ఎండి హజ్కీకచోకాసేన్ చేతుల మీదుగా అర్చకులు పూజలు నిర్వహించి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం బీసీ కళాశాల విద్యార్థులు నివాసముంటున్న హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో దీని బాగు కోసం సాంఘిక సంక్షేమ అధికారులు ప్రయత్నాలు చేశారు. అయితే భవనం మరమ్మతు చేసినా ప్రయోజనం ఉండదని ఇంజనీరింగ్ అధికారులు స్పష్టం చేశారు. దీంతో కొత్తగా అదనపు గదుల నిర్మాణానికి సంబంధించి శ్రీసిటీ ఎండి రవీంద్ర సన్నారెడ్డి అభ్యర్థన మేరకు ఎస్ఎస్ ఇన్స్ట్రుమెంట్ కంపెనీ యాజమాన్యం ముందుకు వచ్చింది. దాదాపు 52 లక్షల రూపాయల సిఎస్ఆర్ నిధులతో మూడు అదనపు గదులు నిర్మించడానికి కంపెనీ యాజమాన్యం అంగీకరించింది. ఈ నేపథ్యంలోనే అదనపు గదుల నిర్మాణానికి ఎస్ఎస్ ఇన్స్ట్రుమెంట్ కంపెనీ ఎండి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎండి హజ్కీకచోకాసేన్ మాట్లాడుతూ 4 నెలల్లో అదనపు గదుల నిర్మాణాన్ని పూర్తి చేసి అప్పగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రవి, బిసి సహాయక సాంఘిక సంక్షేమ అధికారి కృష్ణయ్య, స్థానిక హాస్టల్ వార్డెన్ గంగాధరం, బీసీ బాలికల వసతి గృహం వార్డెన్ జైకుమారి పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి


విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న దాతలు

ప్రజాశక్తి -కోట : రానున్న పదవ తరగతి పరీక్షల్లో కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోట మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు తిరుమూరు మురళి అన్నారు. బుధవారం కోట మండలం కొత్తపట్నం పంచాయతీలోని గోవిందపల్లి జిల్లా పరిషత్ హై స్కూలులో సరస్వతి పూజలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టెన్త్ క్లాస్ విద్యార్థిని విద్యార్థులకు దాతలు మంజు ఫ్యాన్సీ దేవి సింగ్, ఆర్ నగేష్, సహాయ సహకారాలతో ప్యాడ్,స్కేల్,పెన్సిల్,పెన్స్, ఎరేజర్, షార్ప్నర్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ టి.కర్లపూడి దిలీప్ కుమార్,ఎస్ కే.షఫీ, తిరుపతి పార్లమెంటు ఎస్ఎస్ఎల్ ప్రధాన కార్యదర్శి ఇన్నమాల అనోక్, కొత్తపట్నం పంచాయతీ టిడిపి బిసి నాయకులు చెన్నపట్నం శీనయ్య, దక్షాది బాబు పాల్గొన్నారు.

రోడ్లపై ఆక్రమణలు తొలగించండి: డిఎస్‌పి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రోడ్లపై ఆక్రమణలు తొలగించాలని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి ఆదేశించారు. శ్రీకాళహస్తి పట్టణ ప్రధాన వీధుల్లో బుధవారం తన సిబ్బందితో కలసి పర్యటించారు. ప్రధాన వీధుల్లో ట్రాఫిక్ కు అంతరాయం కలిగించే విధంగా ఉన్న దుకాణాలను ఆయన గుర్తించి వాటిని వంటనే తొలగించాలని లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ వెంకటేశులు, బుచ్చినాయుడు కండ్రిగ సిఐ తిమ్మయ్య పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మాదకద్రవ్యాల వాడకం ఒక ప్రమాదకరమైన వ్యసనమని, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ జి కోటేశ్వరయ్య అన్నారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పుత్తూరులో మాదకద్రవ్యాల నివారణపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ జి కోటేశ్వరయ్య మాట్లాడుతూ యువతరాన్ని చెడు మార్గాల్లో నడిపిస్తున్న దురలవాట్లలో మాదకద్రవ్యాలు ఒకటన్నారు. ఈగల్ క్లబ్ విభాగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఈగల్ క్లబ్ కన్వీనర్ డాక్టర్ జె కోటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ వి వీరయ్య, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ కే శ్రీనివాస్, న్యాయ నిపుణులు మురగారెడ్డి, ఇతర అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

వెటర్నరీ వర్సిటీ విద్యార్థుల వినూత్న నిరసన

ప్రజాశక్తి - క్యాంపస్:

తమకు స్టైఫండ్ పెంచాలని కోరుతూ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 38వ రోజుకు, దీక్ష 34వ రోజుకు చేరుకుంది. విద్యార్థులు విశ్వవిద్యాలయ పరిపాలనా భవనం ముందు మోకాళ్లపై కూర్చొని భిక్షాటన చేస్తూ వినూత్న నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఈ నెల 5న ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం తో చర్చలు జరిపేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జె.వి.రమణ విద్యార్థులకు కనీసం సమాధానం కూడా ఇవ్వకుండా, విద్యార్థులు ఎండలో మోకాళ్లపై భిక్షాటన చేస్తున్నా పట్టించుకోకుండా తన కార్యాలయంలోకి వెళ్లిపోవడం విద్యార్థుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిందన్నారు. విద్యార్థులు మూడు గంటల పాటు భవనం ముందు ఎండలో నిరీక్షించారు. అనంతరం వైస్ ఛాన్సలర్ బుధవారం సాయంత్రం పశు సంవర్థక శాఖ మంత్రిని కలవనున్నట్లు ప్రకటించారు. కానీ, విద్యార్థులను వెంట తీసుకెళ్లలేమని చెప్పడం వారిలో నిరాశను పెంచింది. విద్యార్థులు రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీలతను, ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ డాక్టర్ చెంగల్వ రాయలుని, మంత్రిని కలవాలని, సమస్య త్వరగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

కూలీలకు సదుపాయాలు కల్పించండి: ఎంపీడీవో

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడివో విజయలక్ష్మి

ప్రజాశక్తి - ఓజిలి: ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్స్ తమ వృత్తిలో బాధ్యతా యుతంగా పనిచేస్తూ కూలీలకు అన్ని సదు పాయాలు కల్పించి ఆదర్శంగా నిలవాలని ఎంపీడీవో విజయలక్ష్మి పిలుపు నిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ ఉషారాణి , ఈసీ సుబ్రహ్మణ్యం, టిఏలు శ్రీనివాసులు , కృష్ణ ,బిఎఫ్ టి పెంచలయ్య , వివిధ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఘనంగా వైసిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - ఓజిలి : వైసిపి ఆవిర్భావ దినోత్సవాన్ని వైసిపి మండల అధ్యక్షుడు పాదర్తి హరినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గడ్డం అరుణరెడ్డి , ఎంపీటీసీ రఘురాం రాజు, కో ఆప్షన్ సభ్యులు షేక్ ఖాదర్ బాషా, ఉప సర్పంచ్ ఉచ్చూరు హరినాథ్ రెడ్డి, దేశిరెడ్డి మధుసూదన్ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : గూడూరు వైసిపి నాయకులు సుభాన్ ఆధ్వర్యంలో గూడూరు శాంతినగర్ వద్ద వైసిపి విగ్రహా నికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం యువత పోరు కార్యక్రమానికి విద్యార్థులు నాయకులు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాయుడుపేటలో

నాయుడుపేట: సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆదేశాల మేరకు వైసిపి ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం నాయుడుపేట పట్టణంలో ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్య నారాయణరెడ్డి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, వైసీపీ పట్టణ అధ్యక్షులు కలికి మాధవరెడ్డి, వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు ఒట్టూరు.కిషోర్ యాదవ్, రాష్ట్ర మహిళా కార్యదర్శి కురగుండ్ల ధనలక్ష్మి , వైసీపీ నాయకుల తో కలసి వైసిపి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

తడ: తడ మండలం తడలో వైసీపీ మండల అధ్యక్షులు కె అర్ముగం ఆధ్వర్యంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులతో కలసి తడ బజారు సెంటర్ వద్ద వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కాకాణి గోవర్ధన్ రెడ్డి సారధ్యంలో వైసీపీ సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో వైసీపీ యువత పోరుకు భారీగా నాయకులు తరలి వెళ్లారు.

సత్యవేడు: మండల వైసిపి కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కేకు కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

రామచంద్రపురం, చంద్రగిరి: నియోజకవర్గ కేంద్రమైన చంద్రగిరి, రామచంద్రాపురం మండలంలోని ప్రసన్న వెంకటేశ్వరపురం గ్రామాలలో నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, ఏవి బ్రహ్మానంద రెడ్డి, జడ్పిటిసిలు యుగంధర్ రెడ్డి, ఢిల్లీ రాణి, నాయకులు మాజీ ఎంపీపీ వేణుగోపాల్ రెడ్డి, కొట్టాల చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

కోట: : వైసీపీ కోట మండల కన్వీనర్ పలగాటి.సంపత్ కుమార్ రెడ్డి, చిల్లకూరు సాయి ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పగాటి.సంపత్ కుమార్ రెడ్డి,చిల్లకూరు సాయిప్రసాద్ రెడ్డి, దేవారెడ్డి నాగూర్ రెడ్డి,సన్నారెడ్డి చెంచు రాఘవ రెడ్డి,కోట మండల వైసీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ పామల సురేంద్ర,జెడ్పిటిసి కోటయ్య,మాజీ జెడ్పిటిసి ఉప్పల ప్రసాద్ గౌడ్, పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి వైసీపీ కార్యాలయ ఆవరణలో వైసీపీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు వయ్యాల సుధాకర్ రెడ్డి, కంఠా ఉదయ్ కుమార్, బాలిశెట్టి చంద్ర శేఖర్, శ్రీవారి సురేష్, సాధన మున్నా రాయల్ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రెండో పట్టణ పరిధిలోని బేల్దారి కాలనీ వద్ద యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన బుధవారం చోటు చేసుకుంది. గూడూరు రెండో పట్టణ సిఐ శ్రీనివాస్ కథనం మేరకు.. బీహార్‌కి చెందిన మొహమ్మద్ ఇస్మాయిల్ (35) బేల్దారు పనులు చేసుకుంటూ గూడూరు రెండో పట్టణంలోని బేల్దారి కాలనీ లో నివసిస్తున్నారని, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మ హత్య చేసుకున్నాడని తెలిపారు. వ్యక్తి గత కారణాలతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని విచారణలో తెలిసిందన్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఏఎస్ఐ మృతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రోడ్డు ప్రమాదంలో ఏఎస్ఐ మృతి చెందిన సంఘటన బుధవారం వడమాలపేట మండలంలో చోటుచేసుకుంది. వడమాల పేట మండలం అప్పలాయిగుంట గ్రామంలో బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో వడమాలపేట ఏఎస్ఐ గురు స్వామి(61) సహచర ఉద్యోగి కర్మక్రియలకు వెళ్లి తిరిగి స్థానిక పోలీస్ స్టేషన్ చేరుకుంటున్న క్రమంలో ద్విచక్ర వాహనం నుండి జారీ నేలపై పడ్డాడు. తల వెనక భాగంలో బలమైన గాయాలై చెవిలో, తల వెనక భాగం తీవ్ర రక్తస్రావమైంది. హుటా హుటిన పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలంలోనే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుం బ సభ్యులకు అప్పగించారు. వడమాలపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు మహిళలు ఆత్మహత్య

ప్రజాశక్తి -రామచంద్రపురం: తిరుపతి జిల్లాలో వేర్వేరు చోట్ల ఇద్దరు మహిళలు బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు..

రామచంద్రాపురం మండలంలోని రాయలచెరువు కట్టపై ఓ గుర్తు తెలియని మహిళ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం స్థానికులు గుర్తించారు. రాయల చెరువు కట్ట పై నూతన చేపల మార్కెట్‌కు ఎదురుగా ఉన్న పొదల్లో రెండు రోజుల క్రితం మహిళ చెట్టుకుపై భాగంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బుధవారం ఉదయం ముళ్ల పొదల ప్రాంతం నుండి దుర్వాసన రావడంతో స్థానికులు రామ చంద్రాపురం పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్ఐ రామాంజనేయులు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా మృతురాలు ఆకుపచ్చని చీర, ఎర్రని రవిక, చేతిలో గాజులు ధరించి వుంది. నెరిసిన జుట్టు, వయసు 50 సంవత్సరాలు ఉంటుందని ఆయన తెలిపారు. మృతదేహానికి పక్కన మరో ఎర్ర గళ్ల గల మరో టవలు కూడా పడి ఉంది. మృతదేహాన్ని పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ మృతదేహం ఆచూకీ తెలిస్తే 9440796731 ఫోన్ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

తిరుపతి సిటీ: మహిళ ఉరి వేసుకుని మృతి చెందిన ఘటన తిరుపతి కొర్లగుంట మారుతి నగర్ లో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు తిరుపతి కొర్లగుంటకు చెందిన లక్ష్మీ అమృత (27), భర్త వెంకట లోకేష్ దంపతులకు ఇద్దరు పిల్లలు. భర్త వెంకట లోకేష్ డెలివరీ బాయ్ గా పని చేస్తున్నారు. భార్యాభర్తల మధ్య కుటుంబ గొడవల నేపథ్యంలోని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. భర్త పిల్లలతో ఇంటిలో ఉండగానే బెడ్ రూమ్ లోకి వెళ్లి ఆత్మహత్య. ఘటనా స్థలానికి చేరుకున్న ఈస్ట్ డీఎస్పీ శ్రీలత మృదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా సరస్వతి పూజ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండల పరిధిలోని విందూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం వార్షికోత్సవం నిర్వహించారు. పాఠశాలను తోరణాలతో అలం కరించి సరస్వతీ పూజలు చేశారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లు అందించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు డివిఎన్ మల్లికార్జునరావు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్ శ్రీనువాసులు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ శ్రీనివాసులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరీక్షలలో మంచి ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి -రామచంద్రపురం:

ప్రతి విద్యార్థి కష్టపడి చదివి అక్షర దోషాలు లేకుండాపదవ తరగతి పరీక్షలు రాసి మంచి ఫలితాలను సాధించాలని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ తెలుగు విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పిసి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మిట్టూరులోని చేకూరి నాగమ నాయుడు ఎర్రమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సరస్వతీ పూజ, పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యాధికారులు మార్కండేయ నాయుడు, ఎంఈఓ జయ వేలు , ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్ రెడ్డి. పాఠశాల కమిటీ ఛైర్మన్ చిట్టిబాబు పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన సవరణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని న్యూ మంగళం గ్రామపంచాయతీ కార్యాలయం వారు విడుదల చేసిన (పత్రికా ప్రకటన) టెండర్ నోటీసును 12న ప్రజాశక్తి దినపత్రికలో వేలము ప్రకటనగా తప్పుగా ముద్రించడం జరిగినది. వేలము ప్రకటనను టెండర్ నోటీసుగా భావించి టెండరు ప్రక్రియలో పాల్గొనవలసినదిగా ఔత్సాహికులకు విజ్ఞప్తి చేయడమైనది.

IN THE COURT OF THE MACT VII th ADDL. DISTRICT JUDGE CUM-JUDGE FAMILY COURT, ANANTHAPURAMU.
M.V.O.P. No:280/2023

Between:
Vankadot Thipli Bai and others ...Petitioners
And
Asannagari Padmavathi and another ...Respondants

Notice to Respondant No:1

R1:Asannagari Padmavathi D/o A.Venkataramana, R/at D.No:2-61A, M.R.Palli Village, Thirupathi, (owner of the Crime Vehicle Auto bearing No:A.P.02-W-4064)

ఇందుమూలముగా ప్రతివాదికి తెలియజేయడం ఏమనగా వాది మీపై నష్టపరిహారము కోరుతూ పై కోర్టు నందు దావా దాఖలు చేసి ఉండగా కోర్టువారు మీ హాజరు నిమిత్తము 07-04-2025వ తేదిన వాయిదా వేసినారు. కావున మీరు ఆ రోజు ఉదయం 10:30 గంIIలకు పై కోర్టు ఎదుట స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టు ఎదుట అభ్యంతరాలు దాఖలు చేసుకొని యెడల మీ పరోక్షమున కేసును తీర్మానించబడును.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
Bodanapati Lakshminayarana,
Advocate, Ananthapuram.
Cell:9440289897.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE OF TIRUPATI
E.P.NO: 119 of 2024
O.S.NO : 324 of 2021
Gotti Gajendra ...Petitioner/D.Hrs
Vs.
K.Mythili Devi and another ...Respondents/J.Dr

NOTICE TO RESPONDENT /DEFENDANT

To JDr/Respondent No.1 K.Mydhili Devi W/o. Late Kondipati Dharmaiah, D.No.14-1260, Kaveri Cross, Ram Nagar Colony, Chittoor. Jr/Respondent No.2 Nama Raghavendra Rao S/o Nama Vengaiah D.O.615/H2, peddakapu layout, Tirupati.

NOTICE

Please take notice that the above E.P is posted to 03.04.2025 for your appearance either in person or thorugh your advocate. Failing which the above E.P. Will be decided exparte.
(By the order of the Court)
MATTA PURUSHOTHAM REDDY
Advocate for Petitioner/DHrs

గ్రామ పంచాయితీ కార్యాలయము, తిరుమలనగర్

రిక.నెం.14/2025 తేది:12-03-2025

టెండరు ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా తిరుపతి గ్రామీణ మండలం, తిరుమలనగర్ గ్రామ పంచాయితీ కి అవసరముగు క్రింద తెలిపిన వస్తువులను 2025-26 ఆర్థిక సంవత్సరమునకు అనగా 01.04.2025 నుండి 31-03-2026 వరకు సరఫరా చేయుటకు తేది: 21.03.2025 శుక్రవారము ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 2.00 గంIIల వరకు షీల్డు టెండర్లు స్వీకరంచబడును. టెండర్ల నందు పాల్గొనుటకు ధరావత్తును ఏదేని జాతీయ బ్యాంకు నందు పంచాయితీ కార్యదర్శి, తిరుమలనగర్ గ్రామ పంచాయితీ పేరున తీసిన డి.డి. లను మాత్రమే అనుమతించబడును. స్వీకరించబడిన షీల్డు టెండర్లను మధ్యాహ్నం 3.00 గంటలకు హాజరైన టెండరుదారు సమక్షములో తెరువబడును. టెండరు షెడ్యూల్ ఫారములు పొందుటకై గ్రామ పంచాయతీ కార్యాలయము నందు సంప్రదించగలరు.

టెండర్ల వివరములు

వ.నెం	సరఫరా కోరబడుచున్న / చేయవలసిన వస్తువులు	చెల్లించవలసిన ధరావత్తు రూ.
1.	ప్రజారోగ్య పరికరములు సరఫరా కొరకు	5,000-00
2.	త్రాగునీటి పరికరములు సరఫరా కొరకు	5,000-00
3.	వీధి దీపములు పరికరములు సరఫరా కొరకు	5,000-00
4.	స్టేషనరీ సామాగ్రి సరఫరా కొరకు	2,000-00
5.	త్రాగునీటి మోటార్లు రీవైండింగ్ మరియు పంపుసెట్లు / పైపుల రిపేరింగ్ తదితరములు వేయుట కొరకు	2,000-00

షరతులు : 1. షెడ్యూలు ఫారము ఖరీదు రూ.200/-లు, 2. టెండరు షెడ్యూలు ఫారములను తేది: 19-03-2025 సాయంత్రం 5.00 గంటల వరకు గ్రామ పంచాయితీ కార్యాలయం తిరుమలనగర్ నందు పొందవలెను. 3. టెండర్లు నందు నమోదు చేయు రేట్లు యం.ఆర్.పి కి లోబడి వుండవలెను. ఐఎస్ఐ మార్క్ కలిగిన వస్తువును మాత్రమే సరఫరా చేయవలెను. 4. GSTIN Registration మరియు Tax PAN CARD తప్పనిసరి. 5. షెడ్యూలతో పాటు షాప్ యొక్క ఫోటో జతపరచవలయును. 6. గత 03 సంవత్సరముల INCOME TAX RETURNS జతపరచవలయును. 7. గ్రామ పంచాయతీ ఆర్థిక పరిస్థితులను బట్టి చెల్లింపులు చేయబడును.

సం/- **శ్రీమతి పి. స్వాతిశ్రీ,**
పంచాయితీ కార్యదర్శి
తిరుమలనగర్ గ్రామపంచాయితీ.

సం/- **శ్రీమతి యం. వకుళ**
సర్పంచ్,
తిరుమలనగర్ గ్రామపంచాయితీ.

గ్రామ పంచాయితీ కార్యాలయము, రణధీరపురం

రిక.నెం.06/2025 తేది:12-03-2025

టెండరు ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా తిరుపతి రూరల్ మండలం, రణధీరపురం గ్రామ పంచాయితీ కి 2025 -2026 సంవత్సరమునకు అనగా 01-04-2025 నుండి 31-03-2026 వరకు గ్రామ పంచాయితీ కి అవసరముగు క్రింద కనిన వస్తువులను సరఫరా చేయుటకు షీల్డు టెండర్ల ద్వారా తేది: 21-03-2025 ఉదయం 10 గంటల నుండి 03.00 గంటల వరకు టెండర్లు స్వీకరించబడును. స్వీకరించిన టెండర్లను హాజరైన టెండరుదారుల సమక్షమున 04.30 గంటలకు సదరు షీల్డు టెండర్లను తెరవబడును. టెండరు నందు పాల్గొను వారు ధరావత్తులను బ్యాంకరు చెక్కు, డి.డి ద్వారా (SBI Bank) పొంది అందజేయవలయును. సదరు టెండర్లను పాక్షికముగా, పూర్తిగా వాయిదా వేయుటకు, రద్దు పరచుటకు గ్రామ పంచాయితీ కార్యదర్శి కి పూర్తిగా అధికారము కలదు. మిగిలిన విషయములు ఆఫీసు పనిచేయు వేళలలో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొనవచ్చును.

వ.నెం	సరఫరా చేయవలసిన వాటి వివరములు	చెల్లించవలసిన ధరావత్తు రూ.
1.	ప్రజారోగ్య పరికరములు సరఫరా చేయుట	5,000-00
2.	రక్షిత మంచినీటి సరఫరా పరికరములు సరఫరా చేయుట	5,000-00
3.	వీధి దీపముల విద్యుత్ పరికరములు సరఫరా చేయుట	10,000-00
4.	స్టేషనరీ పరికరములు సరఫరా చేయుట	1,000-00
5.	గ్రామ పంచాయితీ యొక్క నీటి సరఫరా మోటార్లు, స్టార్టర్లు రివైండింగ్ మరియు రిపేరు చేయుట మరియు మోటారు దించుట, బయటకు తీయుట	2,000-00
6.	వీధిలైట్లు రిపేరు చేసి అమర్చుట మరియు వీధిలైట్లు ఉదయము ఆఫ్ మరియు సాయంత్రం ఆన్ చేయుట ఎలక్ట్రిషియన్ బాధ్యత (నెల ఒకటికి)	1,000-00
7.	గ్రామ పంచాయితీ నందు వున్న పాత ఇనుప సామాన్లు మరియు పాత వార్త పత్రికలు వేలం	1,000-00

షరతులు : 1. షెడ్యూలు ఫారము ఖరీదు రూ.500/-లు, 2. టెండరు షెడ్యూలు ఫారములు తేది: 17-03-2025 సాయంత్రం 5.00 గంటల వరకు పొందవలెను. 3. టెండర్లు రేట్లు మార్కెట్ రేట్లకు లోబడి అనగా M.R.P రేట్లకు లోబడి యుండవలయును. అధిక రేట్లను కోడ్ చేసిన యెడల టెండరును రద్దు చేయబడును. 4.ISI ముద్రగల నాణ్యమైన సామాగ్రిలు మాత్రమే సప్లై చేయవలెను. 5. Income Tax రిటర్న్స్, సేల్స్ టాక్స్ క్లియరెన్స్, వ్యాట్ వివరములను మరియు ఆధార్ కార్డు జతపరచవలెను. 6. గ్రామపంచాయితీ ఆర్థిక పరిస్థితిని బట్టి చెల్లింపులు చేయబడును.

సం/- **శ్రీ కె. నాగరాజులు**
పంచాయితీ కార్యదర్శి
రణధీరపురం గ్రామపంచాయితీ.

సం/- **శ్రీమతి పి. లీలావతి**
సర్పంచ్,
రణధీరపురం గ్రామపంచాయితీ.

పది పరీక్షల సమర్థ నిర్వహణకు చర్యలు చేపట్టాలి

కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ఈనెల 17వ తేదీ నుండి మార్చి 31 తేదీ వరకు నిర్వహించనున్న పదవ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని అన్ని జిల్లాల కలెక్టర్లను రాష్ట్ర చీఫ్ సెక్రటరీ విజయానంద్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం రాష్ట్ర సచివాలయం నుండి పదవ తరగతి పరీక్షల సన్నద్ధత, కలెక్టర్ కాన్ఫరెన్స్, స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర, పి - 4 సర్వే తదితర అంశాలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ విజయానంద్ జిల్లా కలెక్టర్లు, జిల్లా పోలీస్ అధికారులు, విద్యా శాఖాధికారులు, సంబంధిత అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించగా జిల్లా నుంచి కలెక్టర్ సంబంధిత అధికారులతో హాజరయ్యారు. చీఫ్ సెక్రటరీ మాట్లాడుతూ... రాష్ట్రంలో మార్చి 17 నుండి మార్చి 31 వరకు నిర్వహించే పదవతరగతి పరీక్షలను అత్యంత పటిష్టంగా నిర్వహించాలని అన్ని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. పదవ పరీక్షలకు సంబంధించి సుమారు రాష్ట్ర వ్యాప్తంగా పదవ తరగతి పరీక్షలు విద్యార్థులు హాజరవుతున్నారని అన్నారు. మొత్తం 3450 పరీక్ష కేంద్రాలలో నిర్వహించే పరీక్షా ప్రశ్నా పత్రాలను స్ట్రాంగ్ రూమ్ లకు తీసుకెళ్లేటప్పుడు పటిష్టమైన బందోబస్తు ఉండాలని తెలిపారు. పరీక్షా పేపర్ల తరలింపుపై జిల్లా స్థాయిలో సంబంధిత పోలీస్ సూపరింటెండెంట్ లు, పోస్టల్ డిపార్ట్మెంట్ అధికారులు, ఇతర సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర స్థాయిలో 0866297454 నెం తో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని తెలిపారు. మార్చి 24,25 తేదీలలో నిర్వహించే కలెక్టర్ల కాన్ఫరెన్స్ కు సంసిద్ధం కావాలని తెలిపారు. జిల్లాలో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని తప్పనిసరిగా ప్రతి మూడవ శనివారం ప్రతి ఒక్కరిని భాగ స్వామ్యం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం పై అవగాహన కల్పిస్తూ పరిశుభ్రత దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పదవ తరగతి పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. సమస్యాత్మక పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటుతో పాటు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని తెలిపారు. అలాగే అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల పరిధిలో ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్లను మూసి వేయించాలని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు మరియుకార్యక్రమాలను ప్రజలకు చేరువయ్యేలా సంబంధిత అధికారులు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యువకుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-పలమనేరు: ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది. పలమనేరు ఆది ఆంధ్ర వీధిలోని గోపి కుమారుడు రఘురాం (22) మంగళవారం సాయంత్రం 8 గంటల ప్రాంతంలో వారి ఇంటిలో ఉరివేసుకుని వారి తల్లిదండ్రులు గమనించి హుటాహుటిన పలమనేరు ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వయసుకు వచ్చిన కుమారుడు అర్ధాంతరంగా తనువు చాలించడంతో వారి తల్లిదండ్రులు శోకంతో తల్లడిల్లుతున్నారు. మృతికి గల పూర్తి కారణాలు పోలీసులు దర్యాప్తులో తెలియాల్సి వుంది.

సంఘటన స్థలంలో పోలీసులు

సంస్కృత విశ్వవిద్యాలయంలో ఆర్ట్స్ ప్రాంతీయ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో సహకారంతో ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ ద్వారా తిరుపతిలో 10వ ప్రాంతీయ కేంద్రాన్ని తిరుచానూరులో భారత పార్లమెంట్ లోక్‌సభకు మొదటి డిప్యూటీ స్పీకర్ మాడభూషి అనంతశయనం అయ్యంగార్ విశ్వవిద్యాలయానికి ఇచ్చిన భవనాన్ని ఐజిఎన్సిఎ 10వ ప్రాంతీయ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. అగస్త్య మహర్షి ఉత్తర-దక్షిణ ప్రాంతాలను కలిపిన గొప్పవిశేషాలను, వారాణసి నుండి ఆయన ప్రత్యేక ప్రతిమను తీసుకొచ్చి అగస్త్య మహర్షి పేరుతో ఎగ్జిబిషన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఐజిఎన్సిఎ మెంబర్ సెక్రటరీ డాక్టర సచ్చిదానంద జోషి, డా.ప్రియాంక మిశ్ర, ఐ.పి.ఎస్, డైరెక్టర్ అడ్మినిస్ట్రేషన్, విశ్వవిద్యాలయం విసి ప్రొఫెసర్ జి.యస్.ఆర్ క్రిష్ణమూర్తి, రిజిస్ట్రార్ కె.వెంకట నారాయణరావు, చంద్రగిరి ఎమ్మెల్యే పులవర్తి సుధారెడ్డి హాజరై ఈ 10వ ప్రాంతీయ కేంద్రాన్ని ప్రారంభించారు. చెలికాని అన్నారావు సభాభవనంలో నిర్వహించిన సమావేశంలో ఐజిఎన్సిఎ మెంబర్ సెక్రటరీ డా.సచ్చిదానంద జోషి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి కళలను ప్రోత్సహించడానికి ఐజిఎన్సిఎ గొప్ప వేదికని తెలిపారు. ముఖ్యంగా వైష్ణవాగమాలు, శిల్పకళలు ప్రోత్సహిస్తూ, ఆధునిక తరానికి ఈ కళలపై ఆసక్తిని పెంచాలనే ముఖ్యమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం సహకారంతో ఈ ప్రాంతీయ కేంద్రాన్ని తెలుగురాష్ట్రాలకు కేంద్రంగా ఇక్కడ ప్రారంభించామని వివరించారు. విశ్వవిద్యాలయం వైస్-చాన్సలర్ ప్రొ.జి.యస్.ఆర్ క్రిష్ణమూర్తి మాట్లాడుతూ సంస్కృతంలో ఉండి ప్రస్తుతం మరుగుపడిన కళలను, సంగీతాన్ని, నృత్యాది విద్యలను ఆధునిక ప్రపంచానికి అందించడం ఈ కేంద్రం ద్వారా సాధ్యమవుతుందని తెలిపారు. ప్రత్యేకించి భారతీయ సంస్కృతి సంప్రదాయాలు సంస్కృత భాషలోనే నిక్షిప్తమైనవని సంగీతంతో పాటు సాహిత్యవిద్యను అందించాలనే లక్ష్యంతో విశ్వవిద్యాలయం పనిచేస్తుందని తెలియజేశారు. తిరుచానూరులో ప్రాంతీయ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపిన ఐ.జి.ఎన్.సి.ఎ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఐజిఎన్సిఎ డైరెక్టర్ అడ్మినిస్ట్రేషన్ ప్రియాంక మిశ్ర మాట్లాడుతూ సంస్కృత భాష చాలా ప్రాచీనభాష అయినప్పటికీ నేటికీ కూడా సంస్కృత మాహాత్మ్యం సమాజంలో ఉందని తెలియజేస్తూ సంస్కృత భాషలోనే భాషణం చేశారు. ఐజిఎన్సిఎ చాలా కళలు ప్రోత్సహిస్తుందని, విశ్వవిద్యాలయాన్ని సందర్శించినప్పుడు ఇక్కడ విద్యార్థుల క్రమశిక్షణ, ఆసక్తి చూసి తిరుపతిలోనే ఈ ప్రాంతీయ కేంద్రాని స్థాపించాలని నిర్ణయించుకుని దానిని ప్రారంభించామని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పులవర్తి సుధారెడ్డి హాజరై ఇటువంటి చక్కటి కళాకేంద్రాన్ని తిరుచానూరులో స్థాపించినందుకు ధన్యవాదములు తెలియజేస్తూ, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాళహస్తి నగరంలో ప్రసిద్ధమైన కలంకారి పరిశ్రమను, అక్కడ సాంస్కృతిక వస్త్రవిశేషాలను చూపించారు. కొండపల్లి బొమ్మలను ఢిల్లీ అధికారులకు బహూకరించారు. ప్రాంతీయ కేంద్రాభివృద్ధికి తమవంతు సహకారాన్ని అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మ సుబ్రహ్మణ్యం, మాళవికా జోషి విద్యావేత్త న్యూఢిల్లీ, పాండిచ్చేరి రీజనల్ సెంటర్ డైరెక్టర్ డా.కె.టి.వి రాఘవన్, రీజనల్ సెంటర్ ఐజిఎన్సిఎ నోడల్ ఆఫీసర్ అనితాసూరి, సుమిత్ డే అసిస్టెంట్ ప్రొఫెసర్ ఐ.జి.ఎన్.సి.ఎ, కార్యక్రమ సమన్వయకులు డా.కనపాల కుమార్, పి.ఆర్.ఓ ప్రొ.రమేష్ బాబు, డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ ప్రొ.దక్షిణామూర్తిశర్మ, విశ్వవిద్యాలయంలోని విభిన్న విభాగాల అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పైపు లైను కోసం పరిశీలిస్తున్న అధికారులు

తాగునీటి పైపు లైను కోసం

పరిశీలన

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల పంచాయతీ దిడ్డివారిపల్లి గ్రామానికి చెందిన దాసరి గూడెం గ్రామంలోని 20 కుటుంబాల వారికి గతంలో భూమిలో పూడ్చిన తాగునీటి పైపులైను పూర్తిగా దెబ్బతిని గ్రామస్తులకు తాగునీరు సక్రమంగా అందకపోవడంతో బుధవారం ఎంపీడీవో నారాయణ, ఆర్డబ్ల్యూఎస్ డిఈ కిషోర్ తేజ సచివాలయ సిబ్బంది గ్రామానికి వెళ్లి నూతన పైప్ లైన్ వేసేందుకు గ్రామాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల క్రితం వేసిన పైప్ లైన్ పూర్తిగా పాడైపోయిందని నూతన పైప్ లైన్ వేసి గ్రామస్తులకు తాగునీటి ఇబ్బందులు తొలగించాలన్న ఉద్దేశంతో పరిశీలించామని గురువారం పైపులైన్ పూడ్చేందుకు గోతులు తీసి నూతన పైపులు వేసి తాగునీరు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు జయశంకర్, ఆనంద్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ అనూష పాల్గొన్నారు.

విద్యార్థుల గొడవపై స్పష్టత

కారణాలు వివరించిన రఘువీరారెడ్డి కాలనీ వాసులు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు పట్టణం రఘువీరా రెడ్డి కాలనీలో చోటుచేసుకున్న విద్యార్థుల గొడవపై స్థానికులు బుధవారం మీడియాతో మాట్లాడుతూ తమ బాబును కాలేజీ విద్యార్థులు ఆరుగురు వచ్చి రౌండ్అప్ చేసి కొట్టడంతో వారించడానికి వెళ్ళినప్పుడు తమపై దాడి చేశారని తెలిపారు. దీంతో వారిపై తాము కూడా దాడి చేయాల్సి వచ్చిందన్నారు. ఇద్దరు విద్యార్థులు మధ్య రగడ ఇంత పెద్ద గొడవకు కారణమైందని వాపోయారు. వారు దాడి చేసినప్పుడు పోలీసులను ఆశ్రయించి ఉంటే సరిపోయేదని, ఇంత పెద్ద గొడవ కు దారి తీసి వుండేది కాదన్నారు. కాగా ఈ ఘటన పై ఇంకా పూర్తి సమాచారం పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి వుంది. పలువురిపై పోలీసులు గట్టి సెక్షన్లు పెట్టనున్నారని సమాచారం.

దుకాణాల్లో తనిఖీ చేస్తున్న అధికారులు

దుకాణాల్లో ముమ్మర తనిఖీలు

రూ. 5వేల జరిమానా

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు మున్సిపల్ కమిషనర్ రమణ రెడ్డి ఆదేశాల మేరకు బేకరీ, స్వీట్ స్టాల్స్ పూల మార్కెట్లో మున్సిపల్ అధికారులు సచివాలయ సిబ్బంది బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిషేధిత ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని పలువురికి రూ.5000 జరిమానా విధించినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణ ఇళ్లను క్రమబద్ధీకరించుకోవాలి: ఆర్‌డీవో

ప్రజాశక్తి - పలమనేరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం లేని ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని నిర్మించుకున్న ఇళ్లను క్రమబద్ధీకరణ చేసుకోవాలని పలమనేరు ఆర్‌డివో భవాని పేర్కొన్నారు.15.10.2019 తేదీకి ముందు నిర్మించుకున్న అన్నీ ఇళ్లకు ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. ఈ పథకం కింద లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వనున్నట్లు, కుటుంబంలోని మహిళల పేరుతో రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని తెలిపారు. ఇందుకు 150 గజాల వరకు ఆక్రమించుకున్న ఇళ్లకు పూర్తిగా ఉచితంగా ఇంటి పట్టా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ జారీ చేస్తామని వివరించారు. 150 గజాలు నుండి 300 గజముల వరకు జీవో ఇచ్చిన నాటి నుండి ప్రాథమిక ధర 15 శాతం చెల్లించు షరతుతో పై బిపిఎల్ కుటుంబాలకు 50 శాతం రిజిస్ట్రేషన్ ఫీజు తో చేసిస్తామని తెలిపారు. ఎపిఎల్ కుటుంబాలకు ప్రాథమిక ధర లో 15 శాతం , పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజుతో చేసిస్తామని పేర్కొన్నారు. 301 గజముల నుండి 450 గజముల వరకు 100 శాతం ప్రాథమిక ధర చెల్లించు షరతుతో 50 శాతం రిజిస్ట్రేషన్ ఫీజు తో బిపిఎల్ కుటుంబాలకు రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామన్నారు. ఎపిఎల్ కుటుంబాలకు ప్రాథమిక ధర 200 శాతం ప్రాథమిక ధర చెల్లించు షరతులతో పూర్తి రిజిస్ట్రేషన్ ధరలతో చేసి ఇస్తామని తెలిపారు. 451 గజములు నుంచి పైన ఉన్న గజముల ప్రాథమిక ధరకు ఐదు రెట్లు చెల్లించు షరతుతో, పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజు తో చేసి ఇస్తామని తెలిపారు. ఇలా క్రమబద్ధీకరణ చేసుకోని వారిని భూ ఆక్రమణ చట్టం కింద తొలగించి తర్వాత చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు వెంటనే మీసేవ లేదా జిఎస్‌డబ్ల్యూఎస్ పోర్టల్ లో ఆన్లైన్ ద్వారా ఆర్జీని దాఖలు చేయాలని తెలిపారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి: కమిషనర్

ప్రజాశక్తి- పలమనేరు: పెండింగ్ పన్నులను వెంటనే చెల్లించి పురపాలక అభివృద్ధికి సహకరించాలని పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎన్‌వి రమణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెండింగ్‌లో వున్న పన్నులు సకాలంలో చెల్లించాలని పలమనేరు పురపాలక సంఘానికి సంబంధించి 405 మందికి రూ.48,33,679లు పన్నులు చెల్లించాల్సి వుందన్నారు. ఇంటి యజమానులు వెంటనే సచివాలయాల్లో కాని, పురపాలక సంఘ కార్యాలయంలో కాని, కౌంటర్‌లో కాని చెల్లించాలని కోరారు. ప్రభుత్వ సెలవు రోజులలోనూ పురపాలక సంఘ కార్యాలయంలోని కౌంటర్లలో కూడా చెల్లించవచ్చని పేర్కొన్నారు.